క్లుప్తంగా

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

అశ్వారావుపేటరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రాల విభజన తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీ బాధ్యులతో తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈ సర్వేలో బూత్‌స్థాయి అధికారులు ఓటరు జాబితాలో ఉన్న పేర్లతో సరిపోల్చి మార్పులు ఉంటే తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 1200 ఓట్లు కంటే అధికంగా ఉంటే కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, కానీ అశ్వారావుపేట నియోజకవర్గంలో ఈ పరిస్థితి లేకపోవడం వల్ల కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు అవసరం లేదని వివరించారు. సమావేశంలో ఎన్నికల నాయబ్ తహసీల్దార్ ఎస్‌డీ హుస్సేన్, సీనియర్ సహాయకులు పి.లక్ష్మయ్య, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రచారంపై చర్యలు



అనుమతిలేని ప్రచారంపై జరిమానా విధించి రసీదు అందిస్తున్న కమిషనర్ నాగరాజు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా పట్టణంలో వ్యాపార, రాజకీయ పార్టీలకు ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ బి.నాగరాజు హెచ్చరించారు. బుధవారం అశ్వారావుపేటలో అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తున్న ఆటోను నిలుపుదల చేసి రూ.1000 జరిమానా విధించి వసూలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ప్రచారం, ఫ్లెక్సీలకు అనుమతి పొందాలని సూచించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం



భద్రాచలంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని రెవెన్యూ కాలనీ, అశోక్ నగర్ కాలనీ, యూబీ రోడ్డు, మసీదు రోడ్డులలో కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలతో బుధవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ ప్రధానమంత్రి సురక్ష బీమా, ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకాలను ప్రజలు వివరించారు. చెల్లుబోయిన వెంకన్న, బోడా సత్యనారాయణ, దేవరపల్లి వెంకటేశ్వర్లు, ముత్యాల చంద్రశేఖర్, ములిసేట్టి నిఖిల్, అన్నం సాయి లక్ష్మణ్, వనమా వెంకన్న, సాయి, గిరీష్, నాగ రామా దేవి, సుధారాణి, రవికుమారి, చిట్టమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చర్ల: ఈ నెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే అఖిల భారత ఐక్య రైతు సంఘం మహాసభలకు రైతులు, రైతు ప్రతినిధులు వేలాదిగా తరలిరావాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు.

ఈ మేరకు బుధవారం చర్ల మండలంలో ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహించడంతో పాటు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకుని ముందుకు సాగే దిశగా సభలు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పాలెం చుక్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ క్యాదర్శి దాసరి సాయన్న, డివిజన్ కమిటీ సభ్యులు పాలెం నాగరాజు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకులు శివప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో పడకేసిన ‘ఫాగింగ్’

- పారిశుద్ధ్య లోపంతో దోమల విజృంభణ
- బ్లీచింగ్‌కు కూడా దిక్కు లేదు..
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజానీకం



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు, నిలిచిన మురుగునీరు

అశ్వారావుపేటరూరల్: ఇటీవలే కురిసిన, ప్రస్తుతం అరకొరగా కురుస్తున్న వర్షాలతో దోమలు విజృంభించి పట్టణ, పల్లె వాసులను బెంబేలెత్తుతున్నారు. దోమల నివారణ చర్యలు అటకెక్కడంతోపాటు అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది ఆలసత్వం నెలకొంది.

నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులలో 31,696 మంది జనాభా ఉన్నారు. అలాగే మండలంలో మరో 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో మురుగు కాలువలు, ఖాళీ స్థలాలు, చెరువులు, నీటి కుంటలు, ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు, నీటి నిల్వ కేంద్రాలు దోమల వ్యాప్తికి అవాసాలుగా మారాయి. ప్రతి యేటా వానా కాలం సీజన్‌లో పారిశుద్ధ్య చర్యలతోపాటు దోమల నివారణకు రెండు నుంచి మూడు సార్లు ఫాగింగ్ చేయించే వారు. కానీ ఈ ఏడాది వానాకాలం సీజన్ ముగింపునకు దగ్గరపడినా కూడా ఫాగింగ్ ఊసే లేకుండా పోయింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగి పట్టణ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీతోపాటు, కొన్ని పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా.. ఇవి కాస్తా అలంకారప్రాయంగా మారినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ఖాళీ స్థలాలే అడ్డాలు..

ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, సంత మార్కెట్, వడ్డెర బజారు, కోనేరు బజారు వద్ద కాలువలు, గుర్రాల చెరువు మార్గంలో శ్మశాన వాటి వద్ద, ఖమ్మం మార్గంలో రెస్టారెంట్‌ల వద్ద ఉన్న నీటి నిల్వ కుంటలు ఉన్నాయి. అలాగే దొంతి కుంట చెరువులో గుర్రపు డెక్క మేట వేయడంతోపాటు, మురుగు కాల్వలు పేరుకుపోయాయి. వీటిని శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో దోమల లార్వా అధికంగా ఉత్పత్తి అవుతోంది. రోజుల తరబడి డ్రెయినేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండటం, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు ఆవాసంగా మారాయి. అలాగే పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్ ఏరియా, గాంధీబొమ్మ సెంటర్, ముస్లిం బజారు, ఆర్టీసీ బస్టాండ్ వెనుక వీధి, గోగులబంధం ప్రాంతం, కాళింగుల బజార్, పేరాయిగూడెం, పాత పేరాయిగూడెంలో ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాల్లో పిచ్చి మొక్కలు, నీటి కుంటలు నిల్వ ఉండటంతో దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారాయి. దీంతో పట్టణ వాసులు దోమల బారిన పడి మలేరియా, డెంగీ బాధితులుగా మారి ఆస్పత్రుల పాలు అవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి అన్నీ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని పట్టణ, పల్లె వాసులు కోరుతున్నారు.

పల్లెల్లోనూ అధ్వానం..

మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గడిచిన కొంతకాలం ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసిన తర్వాత జీపీల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. కాగా, వీరిలో కొంతమంది ప్రత్యేకాధికారులు బాధ్యతల స్వీకరించేందుకు వెళ్లి ఆ తర్వాత అప్పుడప్పుడు వెళ్లి సిబ్బందితో మాట్లాడి వచ్చేస్తున్నారు. కనీసం పంచాయతీ పరిధిలోని ఒక్క వార్డులో కూడా పర్యటించడం కానీ, సమస్యలను పట్టించుకోవడంగాని ఏ అధికారీ చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు జీపీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి చాలా కాలం కావడంతో పారిశుద్ధ్యం పడకేసింది. పంచాయతీల్లోని అంతర్గత రోడ్లుపై బురద, డ్రెయినేజీ నీరు పారుతూ అధ్వానంగా తయారయ్యాయి. కనీసం ఇళ్ల వద్ద ఉన్న చెత్తను తీసుకెళ్లేందుకు ట్రాక్టర్లు కూడా రావడం లేదని, దీంతో ఇళ్ల వద్ద చెత్త నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. వానాకాలం సీజన్, విస్తారంగా వర్షాలు కురుస్తుండగా కనీసం బ్లీచింగ్ చల్లడం లేదని, దోమల నివారణ చర్యలు లేవని పల్లె వాసులు చెబుతున్నారు.

ఫాగింగ్ చేసేలా చర్యలు



వానా కాలం సీజన్‌లో అన్ని చోట్ల ఫాగింగ్ చేయాల్సిన మాట వాస్తవమే. ఇప్పటి దాకా ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడానికి కారణాలు తెలుసుకుంటాం. దీనిపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి యంత్రాల పని తీరు గురించి సమీక్షిస్తాం. యంత్రాలు పని చేసే పంచాయతీల్లో ఫాగింగ్ చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటాం.

– బి.అప్పారావు, ఎంపీడీఓ, అశ్వారావుపేట

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరురూరల్: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సూచించారు. మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసలై ఎంతోమంది తమ జీవితాలను నాశనం చేసుకుని, ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలని అన్నారు. అలాగే మోసపూరిత యాప్‌లు, లింకులను ఓపెన్ చేయొద్దని, ఇంట్లో పెద్దలకు సైబర్ నేరాలపై చైతన్యవంతులను చేయాలని సూచించారు. తొలుత ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి డీఎస్పీ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సదస్సులో మణుగూరు సీఐ పాటి నాగబాబు, ఎస్సై రంజిత్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భద్రయ్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నాగముని నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

భద్రాచలంఅర్బన్: తల్లి వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం గర్భిణులకు, బాలింతలకు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డిలు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రు పాలు తాగించాలని, ఈ పాలు శిశువుకు దివ్యౌషధంగా పనిచేస్తాయని తెలిపారు. బిడ్డ ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని, ఆపై అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలు కూడా అందించాలని సూచించారు. ఇలా బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉండదని అన్నారు.



భద్రాచలంఅర్బన్: తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామకృష్ణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని జమ్మిగూడెం సెక్టార్ పరిధిలోని నారంవారిగూడెం, నందిపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు వరలక్ష్మి, సౌజన్య మాట్లాడుతూ.. కాన్పు తర్వాత బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని, తల్లిపాలే బిడ్డకు పోషకాలు అందిస్తుందని అన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, జోగమ్మ, నాగుర్‌బీ, ఆయాలు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో మంచినీటి పంపులను మరమ్మతులు చేసి నీరు అందించాలని, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగలు డిమాండ్ చేశారు. పార్టీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆదర్శనగర్ కాలనీలో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వే సందర్భంగా కాలనీ ప్రజలు అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకు వచ్చారు. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ముత్తేశ్వరి, భద్రమ్మ, భట్టు కుమార్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

గౌరారంలో వైద్య శిబిరం



దుమ్ముగూడెం: విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ రేణుకారెడ్డి

దుమ్ముగూడెం : మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గౌరారం గ్రామంలో డాక్టర్ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏజీహెచ్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రేణుకారెడ్డి మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. నిల్వ ఉన్న నీళ్లలో టీమోపాస్ ద్రావణాన్ని చల్లాలని ఆశా కార్యకర్తకు సూచించారు. అనంతరం టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గౌరారం గ్రామంలో టీబీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ కోఆర్డినేటర్ వెంకటేశ్వరావు, రాజు, వైద్య సిబ్బంది వెంకట నర్సమ్మ అమ్మాజీ, నాగేశ్వరరావు, పార్వతి, సారిక, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తిర్లాపురంలో..

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మండలంలోని తిర్లాపురం గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు ఇన్నయ్య గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, గ్రామస్తులకు 170 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వానకాలం పరిసరాల పరిశుభ్రత పట్ల పాటించాల్సిన అంశాలను వివరించారు. హెల్త్‌క్యాంప్‌లో సిబ్బంది రూప, సౌజన్య, మారేశ్వరరావు, రాము, రవి, గ్రామస్తులు ఉన్నారు.

కాలువ పూడికతీత



కొనసాగుతున్న పూడికతీత పనులు..

దుమ్ముగూడెం: మండలంలో నంబర్ 19 తాలిపేరు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పూడికతీత పనులను వైయస్ ట్రస్ట్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. పనులను యలమంచి శ్రీనుబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలవ మొత్తం తూటి కాడ, పిచ్చి మొక్కలతో నిండి పోయిందని, దీనివల్ల రైతులకు నీరు వచ్చేందుకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు శ్రీను, తాళ్లూరు రమేష్, ప్రేమ్ కుమార్, బైరెడ్డి సతీష్, మద్దుకూరి వేణు, అపక నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

బూర్గంపాడు: సారపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8గంటల నుంచి 10గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ తెలిపారు. బుధవారం ఓ ప్రకటనలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

యోగా పోటీల్లో సత్తా

మణుగూరురూరల్: ఈ నెల 3వ తేదీన జరిగిన జిల్లా స్థాయి యోగాసనాల పోటీల్లో మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీ శాంతినగర్‌కు చెందిన కొమరం నగేష్ కుమార్తె కొమరం ఇందు.. సత్తా చాటి విజయాన్ని కైవసం చేసుకుంది. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు ఎంపికైన ఇందుకు, ఆమె తల్లిదండ్రుల తోపాటు పలువురు స్థానికులు అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోండి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీడీఓ మహాలక్ష్మి కోరారు. మోడల్ పంచాయతీగా ఎంపిక చేసిన ఊటుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా చేసుకుంటే, బిల్లులు దశలవారిగా వస్తాయని తెలిపారు.

ఆచార్య జయశంకర్ జయంతి

తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాలు, నాయకులు, అధికారులు నేతృత్వంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఆయన చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఆచార్య జయశంకర్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ మార్గదర్శి అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: ఏరియా జీఎం కార్యాలయంలో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు



అశ్వారావుపేటరూరల్: జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు



మణుగూరురూరల్: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిబ్బంది



భద్రాచలంటౌన్: టీఎన్జీఓస్ నాయకుల ఆధ్వర్యంలో నివాళి..



దుమ్ముగూడెం: జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

చర్ల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. చర్ల మండలంలో పేదలకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను చర్లలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం ఆయన పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారఖ్ పథకాల కింద 18 కుటుంబాలకు సంబంధించి చెక్కులను సైతం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగుతున్న ప్రజారంజక పాలనను చూస్తున్న ప్రజానీకం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పరుచూరి రవికుమార్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాదరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు ఇందుల బుచ్చిబాబు, చీమకుర్తి వీరభద్రం, గుండేపూడి భాస్కర్‌రావు, బండిరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అయోధ్య మృతికి సంతాపం

బూర్గంపాడు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోల్లోజు అయోధ్య మృతి పట్ల మండలంలోని అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపిన వారిలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు చెన్నం సూర్యప్రసాద్, భూపెల్లి నర్సింహారావు, బట్టా విజయ్‌గాంధీ, కామిరెడ్డి శ్రీలత, మాజీ ఎంపీపీలు బిజ్జం నాగలక్ష్మి, కైపు రోశిరెడ్డి, ఎస్కే సైదులు,మాజీ సర్పంచ్‌లు, మాజీ సొసైటీ చైర్మన్లు, రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, నాయకులు ఉన్నారు.

అశ్వాపురంలో నివాళి..

అశ్వాపురం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారి మృతదేహానికి వివిధ పార్టీల నాయకులు, సీపీఐ పార్టీ శ్రేణులు, స్థానికులు ఘనంగా నివాళులర్పించారు.

అయోధ్య మృతదేహం కొత్తగూడెం పార్టీ కార్యాలయం నుంచి అశ్వాపురం మండలం మొండికుంటకు చేరగా సీపీఐ పార్టీ శ్రేణులు, వివిధ పార్టీల నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొండికుంట, అశ్వాపురం గ్రామాల్లో మృతదేహంతో ఊరేగింపు నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, వివిధ పార్టీల నాయకులు, సీపీఐ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని పూజలు



బిందెలతో నీళ్లు తీసుకు వెళ్తున్న మహిళలు

గుండాల: ఖరీఫ్‌లో సకాలంలో వరుణుడు కరుణించాలని వేడుకుంటూ.. మండలంలోని నడిమిగూడెంలో గ్రామ దేవతలకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలంతా కలిసి బిందెలతో ఊరేగింపుగా వచ్చి బొడ్రాయి, ముత్యాలమ్మ దేవతలకు జలాభిషేకం చేశారు. వానలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని ఆయా దేవతలను వేడుకున్నారు.

108 వాహనంలో తనిఖీ



తనిఖీ చేస్తున్న ప్రభుత్వ వైద్యుడు మణిదీప్

దమ్మపేట: దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మణిదీప్, దమ్మపేటలో 108 అంబులెన్స్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో నిర్వహణ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర వైద్య పరికరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అత్యవసర సమయాల్లో సకాలంలో స్పందించి, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పైలట్ లాల్‌సింగ్, రమేష్ ఉన్నారు.

శాంతియుతంగా జీవించాలి



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న ప్రకాశ్‌రావు

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో జీవించాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు యూఎస్ ప్రకాశ్ రావు అన్నారు. అశ్వారావుపేటలోని అటెండర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం బానోతు బూవ సింగ్ అధ్యక్షతన ప్రపంచ శాంతి దినోత్సవాన్ని (హిరోషిమా డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో ప్రపంచ యుద్ధంలో హిరోషిమా నగరంపై జరిగిన అనుబాంబు దాడి ఘటన గురించి విద్యార్థినులకు వివరించారు. అణ్వాయుధాల ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హిరోషిమా డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు కమల రాజశేఖర్ మాట్లాడుతూ.. పాఠశాలలోని టెన్త్ విద్యార్థునులకు అణు దాడి వల్ల హిరోషిమా ఎదుర్కొన్న పరిస్థితుల మీద వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వ్యాసరచనలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.